# కవితా కౌముది

## వెల్లవేసుకొచ్చిన చీకటి

రాజ్ పాలెపు

నడి వయసు కూడా లేని నేనే
పోల్చుకోలేని మార్పులు నా పల్లెలో,
పల్లె ముంగిట్లో పట్టణ సౌకర్యాలు
పెరట్లో పాతేసిన పల్లె సాంప్రదాయాలు

కల్లం నుంచి తెచ్చిన కొత్త బియ్యం
కళాయి నుంచి వార్చిన కొత్త బెల్లం
అమ్మలక్కల ఆట్లు, రోకటి పోట్లు
ఏమీ లేకుండానే పెద్ద పండుగకు
అంగట్లో అరిసెలమ్మ సిద్ధం

ఊరూ వాడా వచ్చి చేరే ఏరువాక
ఎప్పుడో చేరిపోయింది బుల్లి తెర వెనుక

చిన్న పనికి, పెద్ద పనికి అందివచ్చిన
మర సాయం
ఆనాడే నా చేజారిపోయింది
వ్యయ(వ)సాయం!

అయిన దానికి, కాని దానికి
వాడేసేదది  యంత్రమో
నా నోటి కాడ ముద్దని
నాకే ముష్టి వేసే కుతంత్రమో
ఏలిన వారికే ఎరుక
ఈ అలవి కాని అభివృద్ధి !

ఆర్థిక నడవాలు అంటూ,
అభివృద్ధి మార్గాలంటూ
ఉన్న ఉపాధిని పీకి
ఊడిగాన్ని నాకు కానుకగా ఇస్తుంటే
వెల్ల వేసుకొచ్చిన చీకటి
పల్లె గుండెల మాటునున్న వేకువని
కమ్మేస్తుంటే ,
ఏమని వర్ణించను పోరి తెచ్చుకున్న
స్వాతంత్ర్యాన్ని ,
కార్పోరేట్ల బూట్ల కింద నలిగిపోతున్న
నా పల్లె పటుత్వాన్ని.!

★★★



# పక్షిలా నేను ప్రయాణిస్తున్నా
తలశిల మహిమ

నా దారి
నాకిష్టమొచ్చిన దారి
దాన్నెవరూ నిర్దేశించలేరు

నా అడుగులను
ఎవరూ కలుషితం చేయలేరు
ఎవరూ దాన్ని అనుసరించలేరు
అనుకరించలేరు

ఎవరికీ అంతుబట్టని దారి
ఆ దారిలో
ట్రాఫిక్ ఆంక్షలు ఉండవు
ప్రమాదాలూ జరగవు

మీ దారులన్నీ
మీ ఊళ్ళకు వెళ్తాయి

మా ఊరుకి
మీ దారిలో
పోవడం కుదరదు
కనుక
నేను నా దారిలో పోతున్నా



భూమి ఆకర్షణలనుంచి
రూపాల నుంచి
ఆధారాల నుంచి
అతీతంగా నేను ప్రయాణిస్తుంటాను

కనుక
నాకే దిగులూ లేదు

నా స్వాతంత్ర ప్రయాణంలో
నిర్దేశిత దిక్కులంటూ ఉండవు
చివరికి
నన్ను నేనే కలుసుకుంటాను
గమ్యస్థానంలో

ఆకలిగొన్న పక్షులు
ప్రయాణం చేస్తూ ఉంటాయి
నీరసించిన పక్షులు
గూళ్ళకు చేరి సేదదీరుతాయి
నాకు ఆకలీ లేదు
నీరసమూ లేదు

నా గూడూ
నా నీడా
నా తోడూ అంతా వేర్వేరు

★★★

## క్షణాలముల్లు
## డేగల అనితాసూరి

కలల దుప్పట్లో దాక్కున్న
నిద్ర పని పడ్తూ
గొంతుతెగిన కోడై
కూస్తూనే వుంటుంది!

అధికారి ప్రకోపమై
హాజరుపట్టీపై
ఎర్రజీరలా పాకుతూ
ఆలశ్యాన్ని గద్దిస్తుంది!

పోగేసుకున్న ఆస్థుల్లో
పోగొట్టుకున్న జ్ఞాపకమై
ఎంతవెదికినా దొరక్క
గతం వెనుక దాక్కుంటుంది!

ఆగని నడకతో
వర్తమానాల్ని కొలుస్తూ
ఎప్పటికప్పుడు సరికొత్తగా
జీవిత పాఠాలు నేర్పిస్తుంది!

★★★



## బతుకుపుస్తకం
## అనంతలక్ష్మి

లోపలంతా ఏముందో తెలీదు
అన్నీ ఖాళీ పుటలే
ఎప్పుడూ ఉత్సుకతే
రేపనే తరువాయి పేజీ తిప్పితే
నాకోసం ఏమి లిఖించబడ్డాయోనని..
మసకబారిన కళ్ళకి
అక్షరాలన్నీ అలుక్కుపోయి
అగుపడుతున్నా
వాస్తవాలు వీరంగం ఆడుతున్నా
ఏదో భ్రమల్లో బతికేస్తూ
బతుకు పుస్తకంలో పుటలన్నీ
తనకి కంఠతా వచ్చని విర్రవీగే
మనిషెంతటి అల్ప జీవి
రేపటి రోజుకై ఆసక్తి గా
పేజీ తిప్పేము ఒకనాడు
సమస్యల చెదలు తినడం
ఆరంభించాక నరాల్లోంచి
పాకే భీతి రేపటి పుటని
ఆహ్వానించదు
చివరి పేజీకి ఉందని తెలిసినా
ఒప్పుకోని మనసు
గడచిపోయిన రోజుల వదలి
పొత్తాన్ని ఆబగా హత్తుకుంటుంది
కాల స్వరూపం ఆకళింపు అయేలోపు
బతుకు జారిపోయింది
గుప్పెట్లో ఇసకల్లే!

★★★

## అనుభూతి
### శిష్ట్లా వి.ఎల్.ఎన్.శర్మ

నన్ను నేను
రచించుకొంటున్న
భావ సంపదలో
నేనై విహరిస్తున్న
స్వేచ్ఛా గీతం!
చేతనాచేతనల ప్రకంపనలలో
నిరంతరం నన్ను వరించే కోరిక
నిట్టూరుపులా నిలబడింది....
తూర్పు పడమరల మధ్య
అంతరాన్ని
ఉదయాస్తమానాలతో కొలుస్తోంది..
కదలలేక నిలబడటమా!
కదలికతో కనబడటమా!
ఉదయించింది
అస్తమించక మానదు
హృదయంలోని 'నేను' తప్ప....
తిమిరం ఆర్తి
వెలుగులో నిలబడదు....
వెలుగూ తిమిరం
కలబడి పోరాడలేవు
పరిణామాన్నే చూపెడతాయి....
నేనుగా నాలో రచించుకుంటున్న
స్వేచ్ఛా గీతంలో
కాలమనే ద్రవాన్ని
తాగుతున్న అనుభూతి!

★★★

## వియోగులు
### వి.ఎస్.ఎన్.పి.కవితా

వాడు!
మండుటెండలో ఎండుతాడు
జడివానలో యీదుతాడు
చలిపులి నోట్లో తల దూరుస్తాడు
మాతా !కబళం!
మాధవ కబళం !
ఆడగందే పెట్టనిది అమ్మోతుందా?
ఆలోచనే రానివ్వకుండా
వీధుల్లో వెంపర్లాడతాడు!
ఆమె!
వచ్చినవాడు కుచేలుడో? కుబేరుడో?
సుఖభోగో! రోగో!
వద్దనకుండా మెదడును మొద్దుచేసి
ఒద్దకు చేరిన వాణ్ణి ముద్దు చేసి
ముద్దకోసం ముద్దరాలౌతుంది!
అది!
తోకూపుకుంటూ తలాడించుకుంటూ
పాచికూడో! ఎంగిలి మెతుకులో!
పారేసిందే పరమాన్నంగా
ఛిఛీ అనీసడించినా! ఛెఛే అనదిలించినా!
అంతో యింతో దక్కిందే బొక్కుతుంది!
వీధికి వాచ్ మాన్ ఔతుంది!

వాళ్ళు!
ద్వంద్వాతీతులు!
వీతరాగభయక్రోధులు!
జీవేశ్వరార్చనలో
తలమున్కలైన యోగులు!
ప్రపంచానికి ప్రజ్ఞాతం కాని
స్థితప్రజ్ఞులు!

★★★

# రసరేఖలు శ్రీధర్ బచ్చోటి

ఈ దినమ్మున దొరికినవెన్నొ సిరులు
ఎంత యానందకరమైనదీ క్షణమ్ము!
ఏమి కావలెనెపుడైననింత కన్న
వలసినవి యన్ని నా చెంత వచ్చి చేరె

ఎవరు మాటలతోడ హింసింపలేదు
ఎడదకెవరు గాయమ్మొనరింపలేదు
ఎల్లరును మంచివారలే యీ దినమ్ము
మనసు సర్వము నిండె సమ్మదము తోడ

పెక్కు దినములు నెలలుగా వెదకుచున్న
వస్తువెట్టులో నా కంట పడెను నేడు
అలిగి యెచ్చటికో కన్నుమరగినట్టి
నేస్తమీ నాడు నాదు సన్నిధిని నిలచె

పేదనై సర్వమును నను విడచిపోవ
కాలతగిలెనీ రూక నా కడుపునింప
ఆశ్రయముపోయి తిరుగాడి యలసిపోవ
తలను దాచుకొనగ చిన్న స్థలము దొరికె

అల్పమైనను కోర్కె యనల్పమైన
వలసినది పొంద యానందభరితమాత్మ
ఇదియె యానందమిదియె సంతృప్తి యన్న
సిరులు సిరులు కానేరవక్కరను మించ



చిత్రం:కె.రామ్మోహన్

COMMENTS